


తీరంలో అలల జోరు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఉప్పాడ సముద్ర తీరం అలల ఉవ్వెత్తినా ఎగసి పడుతున్నాయి. ప్రస్తుతం సముద్ర నీటిమట్టం పెరిగి అలలు ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డుకి తాకడంతో



ఎగిసిపడుతున్న సముద్రపు అలలు

ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. ఇప్పటికే అలల తాకిడికి మాయపట్నం, సూరాడుపేట గ్రామాల ఇల్లు నేలమట్టమయ్యాయి. ప్రస్తుతం ఏర్పడిన వాయుగుండంతో మరిన్ని గృహాలు కోల్పోక తప్పదని మత్స్యకారులు వాపోతున్నారు.

గోదారి జలాలు కడలి పాలు

- ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో వరద
- ఇప్పటి వరకు సముద్రంలోకి 4,178 టిఎంసిల విడుదల
- గోదావరి జిల్లాల్లో వాడుకున్నది 163 టిఎంసిలు మాత్రమే
- నీటిని సద్వినియోగం చేసుకుంటే 4.18 కోట్ల ఎకరాలకు సాగునీరు



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదలవుతున్న గోదావరి జలాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఏటా గోదావరి నుంచి వేలాది టిఎంసిల నీరు సముద్రంలోకి వృథాగా పోతుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు రికార్డు స్థాయిలో 4,178.72 టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది. ఈ సీజన్‌లో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పరిశ్రమలకు 163 టిఎంసిల నీటిని మాత్రమే వినియోగించుకున్నారు.

ఈ ఏడాది గోదావరి జిల్లాలో 8.96 లక్షల ఎకరాలను సాగు చేశారు. రబీ సీజన్‌లో గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు సాగునీటి ఇబ్బందులను ఎదుర్కోవడం పరిపాటిగా మారుతోంది. సమగ్రమైన నీటి పొదుపు చర్యలు పాటించకపోతే రబీ సీజన్‌లో పంట గట్టెక్కడం గగనమవుతుంది. ఏటా రబీలో సాగునీరు అందించేందుకు, నీటి పొదుపు చర్యలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నది. మంగళవారం కూడా గోదావరి నుంచి 2.50 లక్షల నీరు సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. ఏటా జులై, ఆగస్టు నెలలో గోదావరికి వరద రావడం పరిపాటి. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనూ రికార్డు స్థాయిలో వరద వచ్చింది. ఇలా వరద రావడం ఏడేళ్ల కాలంలో ఇదే ప్రథమం. సెప్టెంబర్ నెలలో ఏకంగా 1591.94 టిఎంసిల నీరు కడలి పాలైంది. అక్టోబర్ నెలలోనూ సరాసరిన రోజుకు రెండు లక్షల క్యూసెక్కుల వరద నీరు సముద్రంలో కలుస్తుంది.

సముద్రంలో కలిసిన నీరు

నెల	నీరు (టిఎంసిల్లో)
జూన్	26.21
జులై	677.68
ఆగస్టు	1,219.40
సెప్టెంబర్	1,591.94
అక్టోబర్ (15 వరకూ)	663.49
మొత్తం	4,178.72

వినియోగించిన నీరు

నెల	నీరు (టిఎంసిల్లో)
జూన్	16.60
జులై	33.47
ఆగస్టు	27.27
సెప్టెంబర్	30.76
అక్టోబర్ (15 వరకూ)	15.63
మొత్తం	123.33

ఒక టిఎంసితో 11 వేల ఎకరాలకు సాగునీరు

నీటిపారుదల శాఖ లెక్కల ప్రకారం ఒక టిఎంసి నీటిని 11 వేల ఎకరాలకు అందించొచ్చు. కనిష్టంగా పదివేల ఎకరాల వరి పంటకు సాగునీరు ఇవ్వొచ్చని నీటి పారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ లెక్కన ఈ ఏడాది గోదావరి నుంచి సముద్రంలో కలిసిన 4,176 టిఎంసిల నీటిని పూర్తి స్థాయిలో సాగునీటి అవసరాలకు వినియోగించు కుంటే 4.18 కోట్ల ఎకరాలకు సాగునీరు అందే వీలుండేది.

పోలవరం పూర్తయితేనే పరిష్కారం :

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణ, విశాఖ పట్టణం జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలను తీర్చడం కోసం పోలవరం ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 7.72 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించే అవకాశం ఏర్పడు తుంది. 194 టిఎంసిల నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భవిష్యత్తు అవసరాలను తీర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. ఏటా రబీలో సాగునీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కే ఆస్కారం ఏర్పడుతుంది.



టంప్ సుంకాల ప్రతులను దగ్ధం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ట్రంప్ సుంకాలపై నిరసన

ప్రజాశక్తి - తాళ్లరేవు, కాజులూరు

భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మంగళవారం స్థానిక సంతపేట సెంటర్లో జరిగిన ఈ నిరసనలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడారు. భారతదేశం నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులపై అమెరికా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశంలో తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. దీనివల్ల భారతదేశంలో పరిశ్రమలు మూత మూతపడి ఉద్యోగాలకు కోత, ఉత్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ రంగం మొత్తం దెబ్బతింటుందన్నారు. రొయ్యలు, పత్తి, పాడి, పౌల్ట్రీ, జీడిపప్పు, చిన్న పరిశ్రమల రంగాలపై తీవ్ర ప్రభావం పడి నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో దిగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడని, మా ఇంటికొస్తే ఏం తెస్తావ్ మీ ఇంటికి వస్తే ఏమి పెడతావ్ అన్న విధంగా ట్రంప్ వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. సుంకాల విషయంలో ప్రధానమంత్రి మోడీ ఏమి మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ట్రంప్ విధానాలను నిరసిస్తూ దీపావళి సందర్భంగా నరకాసుర వధకు బదులుగా నేడు ట్రంప్ వధ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, ఎం.రాజశేఖర్, కెఎస్.శ్రీనివాస్, కె.వెంకటరమణ, టి.రాంబాబు, ఎ.నాగేశ్వరరావు, ఎన్ త్రిమూర్తులు, డి.అదృష్టదీపుడు, జి.భాస్కర్‌రావు, డి.వాసుదేవ, పి.సింహాచలం పాల్గొన్నారు. అలాగే ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కాజులూరులో నిరసన జరిగింది. ట్రంప్ సుంకాల టారిఫ్ పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడారు. ట్రంప్ విధించిన సుంకాలతో భారత దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సుంకాల ప్రభావం అరికట్టకపోతే కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చే రాయితీలు, మద్దతు ధరను పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతుల, రైతు కూలీలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో యువకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - కాకినాడ

తన సోదరిని కాపురానికి తీసుకెళ్ళనీయకుండా కలెక్టరేట్ సర్వే విభాగం ఉద్యోగి అడ్డుపడుతున్నాడంటూ ఒక యువకుడు ఆ ఉద్యోగిపైనా, తనపైనా పెట్రోలు పేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు పోరుపురెడ్డి విఎండి ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...పిఠాపురం రూరల్ మండలం చిత్రాడ గ్రామానికి చెందిన అనంతలక్ష్మిని అదే గ్రామానికి చెందిన యాసరపు వెంకటసతీష్‌కు ఇచ్చి సుమారు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి దుర్గా వైష్ణవి, జ్ఞాన సాయిప్రణీత కుమార్తెలు ఉన్నారు. యాసరపు వెంకటసతీష్ మేనమామ పోరుపురెడ్డి అప్పారావు కలెక్టరేట్‌లోని సర్వే శాఖలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు అందజేశారు. అయితే ఎటువంటి కారణాలు లేకుండా తన అక్క అనంతలక్ష్మిని గత ఆరేళ్లుగా కాపురానికి తీసుకెళ్లకుండా వేధిస్తున్నారన్నారు. దీనికి సర్వే శాఖ ఉద్యోగి అప్పారావు కారణమని ఆరోపించాడు. ఇప్పటికే పలు దఫాలుగా దిశ పోలీస్‌స్టేషన్, ఎస్‌పి, కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తమకు ఎటువంటి ఆస్తుపాస్తులు లేవని ఉన్నదంతా కట్నం, లాంచనాల కింద ముట్ట చెప్పినట్లు తెలిపారు. తన అక్క కాపురానికి అడ్డుగా ఉన్న అప్పారావును తొలగించి, తాను ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే అతనిపై పెట్రోలు పోసి, తాను పెట్రోలు పోసుకున్నట్లు తెలిపాడు. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు తన అక్క కాపురాన్ని నిలబెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కన్నీటి పర్యంతమయ్యాడు.

నేడు ట్రంప్ సుంకాలపై సదస్సు

ప్రజాశక్తి - కాకినాడ

సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని కచేరిపేట సుందరయ్య భవనంలో 'ట్రంప్ సుంకాలు- భారత్‌పై ప్రభావం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ముఖ్య వక్తగా పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కానిస్టేబుల్ దాడిలో యువకునికి ప్రాణాపాయం

- ఆసుపత్రి వద్ద దళిత సంఘాల ఆందోళన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చుతున్న యువకులను చెదరగొట్టే క్రమంలో ఒక కానిస్టేబుల్ చేతిలో గాయపడిన యువకుడు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఆ యువకుడిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం రాత్రి బ్రౌన్ పేట సెంటర్లో యువకులు పోటాపోటీగా తారాజువ్వలు వేసుకుంటుండగా రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కానిస్టేబుల్ వచ్చి యువకులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బ్రౌన్ పేట జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రాంతానికి చెందిన యువకుడు దడాల అక్షయకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతనికి శ్వాస పరంగా ఇబ్బంది పడటంతో మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు, ప్రజలు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని నిరసన తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు లింగం శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో భాగంగా డిఎస్‌పి డి.శ్రీహరిరాజును, స్థానిక సిఐ



దాడిలో గాయపడిన యువకుడు

ఎ.కృష్ణభగవాన్‌లను ప్రజలు ముట్టడించారు. దళితులపై పోలీస్ దాడులు అరికట్టాలంటూ నినాదాలిచ్చారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకునికి ఏమైనా జరిగితే సాహించేది లేదని హెచ్చరించారు. దీనికి కారకుడైనా పోలీస్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడిని డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐ మంగళవారం తెల్లవారుజామున కలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. యువకుని ఆరోగ్యం కాస్త మెరుగుగానే ఉందని, అతడు కోలుకుంటున్నాడని పోలీసులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

దాడి ఘటనపై డిఎస్‌పి దర్యాప్తు

యువకునిపై దాడి ఘటనపై డిఎస్‌పి డి.శ్రీహరిరాజు మంగళవారం బ్రౌన్ పేటలో దర్యాప్తు చేపట్టారు. సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. బ్రౌన్ పేట సెంటర్ నుంచి బాధిత యువకుని ఇంటి వరకూ వెళ్లి పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాలను గుర్తించారు. జరిగిన ఘటనపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్టు డిఎస్‌పి తెలిపారు. ఈ పరిశీలనలో సిఐ రమేష్, ఎస్‌ఐ మౌనిక, ఇంటిలిజెన్స్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులను నిలదీస్తున్న దళిత సంఘాల నాయకులు

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి?

ఆసుపత్రి వద్ద బంధువుల నిరసన

ప్రజాశక్తి - పిఠాపురం

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందంటూ కుటుంబం సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన దొండపాటి శ్రీదుర్గ(25) గర్భం దాల్చిన నాటి నుంచి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతోంది. హైరిస్క్ పేషెంట్‌గా ఆమె వైద్యం తీసుకుంటుంది. ఈ నెల 13న వైద్య పరీక్షలకు వెళ్లింది. వైద్యులు సూచన మేరకు డెలివరీ కోసం ఆసుపత్రిలో చేరింది. 14న వైద్యులు శ్రీదుర్గకు నార్మల్ డెలివరీ అయ్యింది. ఈ సమయంలో ఆమెకు తీవ్ర రక్తస్రావం అయ్యింది. పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీదుర్గ అపస్మారకస్థితికి చేరింది. ఆమె గుండెకు సంబందించిన సమస్య కూడా ఉండటంతో వైద్యులు వెంటనే గర్భసంచిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. పరిస్థితి విషమించడంతో శ్రీదుర్గ 15న మరణించింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందని తల్లి దండ్రులు రాజు, సుబ్బారావు ఆరోపించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం నిరసనకు దిగారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజాతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పిఠాపురం ఎస్సై మణికుమార్ తో పాటు సిబ్బంది వచ్చి బాధితులకు నచ్చజెప్పారు. బలవంతంగా డెలివరీ చేయడం వల్ల పుట్టిన బిడ్డ



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న జడ్‌పిటిసి లోవరాజు

ఎడమ చేయి, కుడి కన్ను పని చేయట్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గొల్లప్రోలు జడ్‌పిటిసి వులవకాయల నాగలోవరాజు ఆసుపత్రికి చేరకుని ఆరా తీశారు.ు బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పాడా పీడీ చైత్ర వర్షిణికి ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, బిడ్డకు మెరుగైన వైద్య చికిత్స చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన పీడీ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. జ

ఈ ఘటనపై డాక్టర్ సుజాత వివరణ కోరగా బాలింత శ్రీ దుర్గ వైద్యం విషయంలో తాము ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించలేదన్నారు. తీవ్ర రక్తస్రావం వల్ల మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామన్నారు. కాకినాడలో చికిత్స పొందుతూ మతి చెందిందన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది ఎవరూ నిర్లక్ష్యం వహించబోరని స్పష్టం చేశారు.

కాపు వన సమారాధనకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఈ ఏడాది నవంబర్ 16న జరిగే కాపు కాపు వన సమారాధనకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ పంతం నానాజీ తెలిపారు. మంగళవారం స్థానిక శుభం కాపు కల్యాణ మండపంలో సంఘ గౌరవ అధ్యక్షులు బసవా ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాపు వన సమారాధన కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు నాయకులు పాల్గొనాలని కోరారు. రాజకీయ ఉపన్యాసాలు లేకుండా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాధవరపు పట్టాభిరామయ్య, వినాయక మాధవరావు, అడపా ప్రకాష్ నాయుడు, ఇమ్మడిశెట్టి వెంకటరమణ, జానపాముల నాగబాబు, సంగిశెట్టి రాంబాబు, రంబాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జగ్గంపేట

భవన నిర్మాణ కార్మికుల జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని ఇర్రిపాకలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ నెహ్రూ

ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 31, నవంబర్ 1వ తేదీన జగ్గంపేటలో జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న మూడేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏవిధంగా పోరాడాలి, గడిచిన మూడేళ్లలో చేసిన పోరాటాలపై మహాసభలో చర్చిస్తామని చెప్పారు. కార్మికుల సంక్షేమ బోర్డులో 25 లక్షల మంది నమోదై ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సంక్షేమ బోర్డు పథకాలు అమలు కాకుండా 1214 మెమో తీసుకు వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ బోర్డు పథకాలు ఊసెత్తడంలేదన్నారు. జిఒ 1214 రద్దుచేసి పెండింగ్ లో ఉన్న క్లైములు, పరిహారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కాపాడటం కోసం కార్మికులు ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కెంగం బాబ్జి, అన్నవరం, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - కరప

మండలంలోని పెనుగుదురు గ్రామంలో మంగళవారం ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సలాది వెంకటశ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. గ్రామాల్లో చెత్త సేకరణ చేయడంలో ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిసిహెచ్.శ్రీకాంత్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌ను తనిఖీ చేసిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలోని పలు సంక్షేమ వసతి గృహాలను ఆర్‌డిఒ కె.శ్రీరమణి మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు అందజేస్తున్న వసతులు, భోజన సదుపాయం, హాస్టల్ లోపల, హాస్టల్ పరిసరాల పరిశుభ్రత, వంటశాలలను పరిశీలించి విద్యార్థులకు అందజేస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న సేవలు, ఆహారం వంటి వాటిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యార్థులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

బుధ, గురువారాల్లో పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు వెన్న శ్రీనివాస్, బి.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రీడా పోటీలు చేబ్రోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాట్మెంటన్, సెస్, యోగ, ఇతర అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆర్థిక సాయంతో పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధితునికి అండగా 'కుడుపూడి'

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల జరిగిన ప్రమాదంలో వెన్నెపూస దెబ్బతిన్న పత్తిగొందికి చెందిన బాధితుడు దున్న సోమరాజుకు స్థానిక యువ నాయకులు కుడుపూడి శ్రీనివాస్ రూ.10 వేలు సాయాన్ని, నిత్యావసరాలను అందజేశారు. ఆ ప్రమాదంలో అతని భార్య చనిపోగా ముగ్గురు కుమార్తెలు ఉన్నారనీ, కుటుంబానికి జీవనాధారం లేదని తనకు పింఛన్ సదుపాయం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని సోమరాజు కోరాడు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, యడ్ల కుటుంబరావు, దున్న మురళీకృష్ణ, గంద్రెడ్డి సోను, ఉండ్రు కనకయ్య, దున్న చక్రయ్య, దున్న శ్రీను పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి కలెక్టర్, ఎస్‌పి బిందుమాధవ్, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. తొలుత ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత్-చైనా సరిహద్దుల్లోని అక్సాయ్ చిన్ వద్ద 1959 అక్టోబర్ 21న పంజాబ్ డిఎస్‌పి కరమ్‌సింగ్ నేతృత్వంలోని సిఆర్‌పిఎఫ్ బృందం గస్తీ కాస్తుండగా సియాచిన్ ఆక్రమణకు చైనా దాడులకు దిగిందన్నారు. వీరిని ఎదుర్కొంటూ చేసిన పోరాటంలో 10 మంది సిఆర్‌పిఎఫ్ పోలీసులు అమరులయ్యారన్నారు. వారి సేవలను స్మరిస్తూ అప్పటి నుంచి ఏటా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమరులైన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. ప్రతి కుటుంబంలో ఏ సమస్య వచ్చినా పోలీసులు గుర్తుకు వస్తారని, వారిని గౌరవించాల్సిన



గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ప్రజాప్రతినిధులు

అవసరం ఉందని చెప్పారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, ఎంఎల్‌సికర్రి పద్మశ్రీ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిఎస్‌పిలు కెవివి సత్యనారాయణ, డి.శ్రీహరిరాజు, ఇతర అధికారులు, సిబ్బంది అమరవీరులకు నివాళులు అర్పించారు. జిల్లాలో అమరులైన 14 మంది పోలీసు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు, పండ్లు అందజేశారు. అనంతరం అమర వీరులను స్మరిస్తూ పోలీసు కార్యాలయం నుంచి భానుగుడి కూడలి వరకూ జరిగిన ర్యాలీ నిర్వహించారు. **సామర్లకోట** స్థానిక ప్రతిభ విద్యా నికేతన్ పాఠశాలలో పోలీస్ అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గంగారావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎస్‌వివిజి.ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి, టి.సాయిరామకృష్ణ, జి.రాజు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** స్థానిక రమణయ్యపేట పరిధిలోని ఎపిఎస్‌పి మూడో బెటాలియన్ ఆవరణలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు.కమాండెంట్ ముద్రగడ నాగేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్మృతి పెరేడ్ నిర్వహించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేసి, అమరుల ధైర్యసహసాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు గంగరాజు, చంద్రశేఖర్, మన్మధరావు, ఆర్‌ఐలు అజయ్‌కుమార్, మురళీమోహనరావు, ప్రసాద్, హరిబాబు, రాము, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్ పథకంపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

జాతీయ రహదారులు, ఆర్ అండ్‌బి, డ్రయినేజీ, జలవ నరులు, పంచాయతీరాజ్ ఇంజినీర్లతో కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మంగళవారం సమావేశం నిర్వహించి వాటర్ గ్రిడ్ పథకం వల్ల జరిగే డ్యామేజీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు నేరుగా పైప్ లైన్ ద్వారా సురక్షితమైన తాగునీటి సరఫరాకై రూ.1650 కోట్లతో జలజీ వన్ మిషన్ కింద ధవళేశ్వరం వద్ద వాటర్ గ్రిడ్ పథకం మంజూరైందన్నారు. ఈ పథకం ద్వారా తాగు నీటి సరఫరా కోసం పైపులైన్ వ్యవస్థ నిర్మాణంలో రోడ్లు, కాలువలు మొదలైన పునాదులపై డామేజ్ లపై ఆయా శాఖల ఇంజినీర్లు 15 రోజులలో మాస్టర్ ప్లాన్ ప్రకారం జరిగే నష్టాల అంచనాల నివేది కలను రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ముందుగా డామేజీలను గుర్తించడం వల్ల ఆయా పనులు నిర్వహణకు నిధులు కేటాయింపునకు ఆస్కారం ఏర్పడుతుందని ఆ దిశగా ఈ యొక్క అంచ నాలను రూపొందిస్తే త్వరితగతిన ఆయా వసతులను మరల పునరుద్ధరించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. లేని పక్షంలో ప్రజలకు ట్రాఫిక్, కమ్యూనికేషన్ వంటి అంశాలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ముం దస్తు అవగాహనతో ఈ యొక్క అంచనాలను కోరడం జరుగుతోందన్నారు శాశ్వత ఉప శమన పనులు మర మ్మతులు, బడ్జెట్ అంచనాల పట్ల మంజూరు కొరకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ముందస్తు అవగాహన ఏర్పడుతుందన్నారు. పైప్ లైన్ వేయ బోయే మార్గాన్ని సర్వే చేస్తూ ఆ మార్గంలో రోడ్లు, కాలువలు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాల డామేజీలను గుర్తించాల న్నారు. జిపిఎస్ మ్యాపింగ్ డ్రోన్ సర్వే ద్వారా స్థలాన్ని డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. ఈ విధంగా ప్లానింగ్, మరమ్మతు, మరియు నివేదిక రూప కల్పన డాక్యుమెంటేషన్ సమగ్రంగా తయారు చేసేం దుకు ముందస్తుగా మార్గం ఏర్పడుతుందన్నారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎవిఎస్.రాజన్, ఆర్ అండ్‌బి ఎస్ఇ బి.రాము, పంచాయతీ రాజ్ ఎస్ఇ పి.రా మకృష్ణారెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యాచరణ ప్రణాళికతో 'పది'లో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలు దోహదప డతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ నందు మంగళవారం డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా ఆధ్వర్యంలో జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ సెక్రటరి ఎ [illegible] మంతరావు సార థ్యంలో రూపొం దించిన 2025 26 విద్యా సంవత్సరం పదో తరగతి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి ఈ ప్రణాళిక, మరింత దోహ దం చేస్తుందని,ఈ విద్యా సంవత్సరం టెన్త్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాను అగ్ర స్థానం లో నిలిపే విధంగా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు విద్యార్థులను సమ న్వయం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఎంఒ బివివి.సుబ్ర హ్మణ్యం, అమలాపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కాశి ఘన సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థినిపై అత్యాచారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరంలో ఒక ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న 14 ఏళ్ల విద్యార్థిని అత్యాచారానికి గురైంది. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వసతిగృహం నుంచి బయటకు వెళ్లిన బాలిక ముఖం, శరీరంపై తీవ్ర గాయాలు ఉండటంతో హాస్టల్ వార్డెన్ నిలదీయడంతో విషయం బయటకు వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన బాలిక రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదవుకుంటోంది. రెండు రోజుల క్రితం బాలిక హాస్టల్ నుంచి బయటకు వచ్చింది. రావులపాలెం మండలం జొన్నాడకు చెందిన అజయ్(20) అనే యువకునితో బైకుపై వెళ్లింది. వీరితో పాటు మరో యువకుడు కూడా వెళ్లాడు. బాలికను వారు రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక లాడ్జికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెపై అత్యాచారం చేశారు. అనంతరం ఆమెను బైక్ తీసుకుని దేవి చౌక్ సెంటర్‌లో వదిలేశారు. హాస్టల్ వార్డెన్ బాలిక తల్లిదండ్రులకు విషయం తెలియజేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేవారు. కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మ పేట పంచాయతీ పరిధిలో గల వల్లు వారి పేట వంట కాలువలో గుర్తుతెలియని మృతదేహన్ని పోలీసులు కనుగొన్నారు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసుగల వ్యక్తి పంట కాలువలో మతి చెందాడు. నీలం నలుపు రంగు చారల టీ షర్టు, ఖాకీ రంగు నిక్కరు ధరించిన మగ వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మతదేహాన్ని పోస్టుర్టం నిమిత్తం రామచం ద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎఎస్ఐ వెంకటేశ్వరావు దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరు జాతీయ రహదారిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. యానాంకు చెందిన బర్రె సతీష్‌కుమార్ తన కుటుంబంతో కాకినాడ నుంచి యానాంకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా యానం వైపు నుంచి కాకినాడకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని కుమార్తె బర్రె జెస్సిక తీవ్ర గాయాలు కాగా, మరో కుమార్తె హయస్‌కు స్వల్ప గాయాలు అయ్యాయని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యాయత్నం

ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ సిబ్బంది

ప్రజాశక్తి - కాకినాడ

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆ మహిళల ప్రాణాలను ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. స్థానిక జగన్నాధపురం సమీపంలోని ఎన్‌టిఆర్ బ్రిడ్జిపై నుంచి ఉప్పుటేరులోకి దూకేందుకు సుమారు 40 ఏళ్ల వయస్సు గల మహిళ ప్రయత్నించింది. ఆ సమయంలో అక్కడే డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాబురావు, పోలీస్ కానిస్టేబుల్ అప్పన్న సమయ స్ఫూర్తితో స్పందించి ఆమెను పట్టుకొని ఉప్పుటేరులో పడకుండా ఆపారు. వెంటనే ఆమెను సురక్షితంగా పైకి లాగి వన్ టౌన్ స్టేషన్‌కు తరలించారు. భర్త వేధింపులు తాళలేక చనిపోయేందుకు ప్రయత్నించినట్లు పోలీసులకు వివరించింది. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళ ప్రాణాలను కాపాడిన ట్రాఫిక్ పోలీసులను పలువురు అభినందించారు.

భార్యపై చాకుతో దాడి

ప్రజాశక్తి - పి.గన్నవరం

భార్యపై చాకుతో భర్త దాడిచేశాడు. దాడిలో భార్యకు కంటిమీద గాయమైంది. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఉడుముడి గ్రామానికి చెందిన నేలపూడి పల్లాలమ్మ(పల్లవి)కి, అదే గ్రామానికి చెందిన గంగరాజుకు 20 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వివాహమైనప్పటి నుంచి వీరిద్దరూ తరచూ గొడవ పడేవారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. అయితే సోమవారం రాత్రి భర్త గంగరాజు తన భార్య పల్లాలమ్మపై చాకుతో దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనలో ఆమెకు కంటిపై తీవ్రగాయమైంది. చికిత్స కోసం ఆమెను అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజి వాచ్ తరలించారు. ఈ ఘటనపై పి.గన్నవరం ఎస్ఐ బి.శివకష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం శివారు కొండాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఎదురెదురుగా వెళు తున్న రెండు మోటార్ సైకిళ్లుఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. మంగళవారం అంగర ఎస్ఐ హరీష్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురం చెందిన కముజు లోవరాజు (33) మోటార్ సైకిల్‌పై సోమవారం రాత్రి అంగర వెళుతున్నాడు. అయితే ఈ సమంయలో ఎదురెదురుగా వస్తున్న బైకు అతడి బైక్‌ను ఢీకొంది. దీంతో లోవరాజు తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. మరో బైక్‌పై వస్తున్న కాట్రేకోన మండలం దొంతుకూరు గ్రామానికి చెందిన కాలేటి బాలయోగి, గెడ్డం నాగార్జునలకు గాయాలు కావడంతో స్థానిక సిహెచ్‌సికి తరలించారు. మృతుడు లోవరాజు 104 వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుని సోదరుడు కౌముజు వీర వెంకట సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ హరీష్ కుమార్ తెలిపారు. కాగా మృతుడు లోవరాజుకు భార్య దుర్గ నీలిమ. ఆమె 9 నెలల గర్భిణి. మృతునికి అక్క, అన్న ఉన్నారు.

గడప దాటుతున్న కలప

- యథేచ్ఛగా వృక్షాల నరికివేత
- గోకవరం ఫారెస్ట్ రేంజి పరిధిలో అక్రమార్కులు



అక్రమంగా తరలిస్తున్న అటవీ కలిపి

ప్రజాశక్తి - సీతానగరం

గోకవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండల పరిసర ప్రాంతాల్లో అక్రమంగా కలప రవాణా జోరుగా సాగుతోంది. పచ్చని చెట్లపై అడ్డగోలుగా గొడ్డలి వేటు వేస్తూ ప్రకృతి సంపదను కొందరు అక్రమార్కులు దోచుకుంటున్నారు.

వేప, తుమ్మ, మామిడి, చింత, టేకు వంటి విలువైన వృక్షాలను నరికివేస్తున్నారు. ఈ ప్రాంతంలోని కార్ఖానాలు, సామిల్లులు, పొగాకు బేరన్లలోని బాయిలర్‌లు, ఇతర అవసరాల కోసం భారీ స్థాయిలో కలపను వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం, పరిశ్రమల అవసరాలకు అటవీ శాఖ అనుమతితో పనికిరాని చెట్లను మాత్రమే వినియోగించాలి. అయితే, అక్రమార్కులు మాత్రం సొంత లాభార్జన కోసం పుష్ప సినిమాను మించి భారీ వృక్షాలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. దేవీపట్నం, రామ న్నపాలెం, బొల్లెద్దు పాలెం, ఇందుకూరుపేట, అచ్చియ్యపాలెం వంటి ప్రాం తాల నుంచి వాహనాల ద్వారా కలపను పట్టపగలే గడప దాటేస్తుంది.

అటవీ చట్టాల ఉల్లంఘన

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు వనమహోత్సవాలు నిర్వహిస్తూ అడవుల పెంపునకు కృషి చేస్తుంటే, అక్రమార్కులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా అటవీ సంపదను దోచుకుంటున్నారు. ఈ అక్రమ కలప రవాణా భారతీయ అటవీ చట్టం-1927 పాటు, ఆయా రాష్ట్రాల అటవీ చట్టాలు, వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 నిబంధనలను ఉల్లంఘిస్తోంది. చట్టాల ప్రకారం అటవీ ఉత్పత్తుల అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణ, చెట్ల నరికివేత తీవ్రమైన నేరాలు. ఇటువంటి నేరాలకు పాల్పడేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, కలపను స్వాధీనం చేసుకోవాలని ఉన్నతాధికారులు పదే పదే వివరణ ఇస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిపై అటవీ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని, కలప రవాణా నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ ప్రాంతంలో పచ్చదనం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రకతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సిహెచ్‌సిలో సేవాకార్యక్రమాలు

ఘనంగా నాగబాబు పుట్టిన రోజు

ప్రజాశక్తి - పి.గన్నవరం

జనసేన నేత రాష్ట్ర అటవీశాఖ ఐటి అడ్వైజర్ పెన్నమరెడ్డి నాగబాబు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగబాబు పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం ఉడిమూడి పిఎసిఎస్ అధ్యక్షులు పెన్నమరెడ్డి వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో పి.గన్నవరం సిహెచ్‌సిలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆసుపత్రి సిబ్బందికి,చికిత్స పొందుతున్న పేషెంట్లకు, గర్భిణులకు, ఫ్రూట్స్, బ్రెడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ నాయుడు, పలువురు నాయకులు మాట్లాడుతూ ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరెన్నో అభిమానులు ఘనంగా జరుపుకోవాలని భవిష్యత్తులో ఇంకా ఉన్నతమైన పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవలు అందించాలని కోరు కుంటున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అభిమా నులు పెన్నమరెడ్డి టీమ్ సభ్యులు తదితరులు నాగబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

'ఆర్ట్స్'లో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ డైరెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్విట్జర్లాండ్‌కు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ డైరెక్టర్ నోసింగిఫైల్ కునెనె ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఆర్ట్స్ కళాశాల విద్యా వ్యాప్తికి చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. కాలేజీలో అందుబాటులో ఉన్న వివిధ సౌకర్యాలైన టెక్నోస్పియర్, ఎల్ఎంఎస్ స్టూడియో, యాంటిక్ ల్యాబ్ (ఫిజిక్స్), డిజిటల్ హబ్, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్, ఐఐహెచ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ల్యాబ్స్, సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ఇతర సౌకర్యాల గురించి వివరించారు. చారిత్రక విద్యాసంస్థను సందర్శించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఎనిమిది అంతర్జాతీయ అడ్మిషన్ల గురించి తెలుసుకుని సంతోషించారు. కునెనె సందర్శనతో ఆర్ట్ కళాశాల గ్లోబల్ ఔట్‌రీచ్‌ను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నట్లు ప్రిన్సిపల్ అన్నారు.

ఎపిఎన్‌జిఒ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎపిఎన్‌జిఒ కోరుకొండ యూనిట్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ జిల్లా నాయకులు డి.చటర్జీ, కోరుకొండ యూనిట్ ఇన్‌ఛార్జి ఎం.యూనీస్ పాల్గొని అసోసియేషన్ కార్యకలాపాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది 25 మంది సభ్యత్వం తీసుకున్నారు.

అమరవీరుల త్యాగాలు స్మరించుకోవడమే ఘననివాళి

ప్రజాశక్తి - రావులపాలెం

సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ,విధి . నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవడమే వారికి మనం అందించే ఘననివాళి అని సిఐ శేఖర్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎస్ఐలు జి.చంటి, కెవి.రమణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోలీసులు అమరవీరుల దినోత్సవంలో సిఐ ఎమ్.శేఖర్ బాబు పాల్గొని అమరవీరులకు ఘననివాళులు అర్పించారు.ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజల సౌకర్యం కోసం రేయింబవళ్లు కృషిచేస్తు మన భద్రత కోసం తమ కుటుంబాలను వదిలి విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది ఎంతో కష్టసాధ్యమైన పరిస్థితుల్లో పని చేస్తారన్నారు. ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన వీరులకు మనం ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం అన్నారు. అమరవీరుల కుటుంబాలకు మన సమాజం నుంచి ఎప్పటికప్పుడు మద్దతు లభించాలని, వారి త్యాగం వృథా కాకూడదని సిఐ అన్నా రు. కార్యక్రమంలో ఎఎస్ఐలు, హెచ్‌సిలు, పోలీసులు పాల్గొన్నారు.



రావులపాలెం పిఎస్ వద్ద అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న సిఐ

డిఎ బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 16 నెలల కాలానికి సంబంధించిన డిఎపై పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపును 2027-28 ఆర్థిక సంవత్సరానికి వాయిదా వేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జిఒపై పెన్షనర్లలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. 2027-28 వరకు ఎన్షనర్లు అందరూ జీవన ప్రమాణాన్ని పెంచుకోగలరా? ఎంతో కొంత మంది ఈ సుదీర్ఘ కాలంలో తనువు చాలించే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో మరోసారి ఆలోచన చేయాలన్నారు. కుటుంబ పెన్షన్ (ఫ్యామిలీ పెన్షన్) పొందుతున్న వారికి డిఎ బకాయిలు తక్షణ అవసరాలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. మానవతా దృక్పథంతో ఆలోచించి, ప్రభుత్వం ఇచ్చిన మొదటి డిఎతో పాటూ బకాయిలను కూడా వెంటనే ఇవ్వాలని సిఎంను కోరారు.

అసంబద్ధ జిఒల జారీ తగదు

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 2024 జనవరి నుంచి ఇవ్వాల్సిన కరువు భత్యం 3.64 శాతం అక్టోబర్ నుంచి చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ 2024 జనవరి నుంచి చెల్లించాల్సిన 21నెలలు బకాయిలు ఉద్యోగులు రిటైర్ అయ్యాక చెల్లిస్తామని జిఒ జారీ చేయడం తగదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, మేడిచర్ల టివిఎస్.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లకు 2027-28 సంవత్సరంలో చెల్లించాలని జిఒ జారీ చేశారు. ఇటువంటి జిఒలు విడుదల చేయడం అంటే ఉద్యోగులను మోసం చెయ్యడం లానే భావించాలన్నారు. సర్వీసు చేస్తున్న ఉద్యోగులకు అకౌంట్ లో తక్షణం జమ చేయాలని సిపిఎస్ ఉద్యోగులకు 90 శాతం నగదు, పెన్షనర్స్ కు తక్షణం నగదు చెల్లించాలని అరియర్ సంబంధించి జిఒను సవరించాలని ఇటు వంటి జిఒలు మూలంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతా రన్నారు. భవిష్యత్‌లో సకాలంలో ప్రభుత్వాలు ఉద్యోగులకు డిఎ చెల్లించకుండా ప్రభుత్వాలు తాత్సారం చేసే వీలుందన్నారు. భవిష్యత్ ఉద్యమాలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.



లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు

జయరాజ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటకు చెందిన వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తండ్రి లక్ష్మణరావు ఇటీవల ఆకస్మిక మృతి చెందారు. పితృవియోగంతో బాధపడుతున్న జయరాజ్ కుటుంబ సభ్యులను మంగళవారం పలువురు నాయకులు పరామర్శించారు. లక్ష్మణరావు చిత్రపటానికి పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుం బ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు .పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు నాయకులు ఉన్నారు.

రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నిడదవోలు నరసాపురం ప్యాసింజర్ రైళ్ల పునరుద్ధరణ కోసం త్వరలో ఉద్యమం చేపట్టాలని పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నిర్ణయించినట్లు సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. మొదటి దశలో వివిధ రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం, తర్వాత ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పట్టణంలో సేవారంగంలో ముందుంజలో ఉన్న క్లబ్‌లతో సమావేశాలు, అనం తరం రాయబారులు, మంత్రులకు, ఎంపీలకు వినతి పత్రాన్ని అంది స్తామన్నారు. అప్పటికి స్పందించక పోతే రైల్‌రోకో నిర్వహి స్తామ న్నా రు. ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్న రైల్వే స్టేషన్‌లో ప్రజలు కోరుకొనే జన్మ భూమి, ఎల్‌టిటి ఎక్స్‌ప్రెస్, కోకినాడ ఎక్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలను పున రుద్ధరించాలన్నారు. దీనిపై ఎంపీ పురంధేశ్వరి స్పందించాలన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల సాయం

ప్రజాశకి - రామచంద్రపురం

మండలంలోని కాపవరం గ్రామంలో గల షిరి సాయిబాబా దేవాలయాన్ని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం సందర్శించారు. ఆయన షిరిడి సాయిబాబాకు పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీతో మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయంగా రూ.50 వేల చెక్కు ఆయన అందజేశారు. మంత్రి వెంట పలువురు కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురికి మంత్రి సుభాష్ ఆర్థిక సాయం

పలువురికి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. వికలాంగుడు యనమదల కాశీకి మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేల చెక్కును అందజేశారు. అదేవిధంగా భీమేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ పూజారి దెందులూరి భద్రరాజు యాత్రికులు ఇచ్చే విరాళాలతోనే జీవనం సాగిస్తున్నారు. అతని కుటుంబ పరిస్థితి తెలుసుకుని అతనికి పూజారికి మంత్రి తక్షణమే రూ.10 వేల సాయం అందజేశారు.

ఆదర్శనీయుడు రమణయ్య

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రయివేటు హాస్టల్స్ స్థానే ప్రభుత్వ హాస్టల్స్ ఏర్పాటుకు కషి చేసిన ఆదర్శనీయుడు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మాజీ ఎంఎల్ఎ బివి.రమణయ్య అని పలువురు కొనియాడారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో మంగళవారం రమణయ్య 33 వర్ధంతి నిర్వహించారు. రమణయ్య విగ్రహానికి దాసరి వెంకటరమణ, వడ్డి నాగేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.ఆంజనేయులు, యడ్ల చిట్టిబాబు, పివి. చక్రవర్తి, కెఎల్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి విశ్వరూప్‌ను కలిసిన బాలకృష్ణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వైసిపి కేంద్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితుడైన పితాని బాలకృష్ణ మంగళవారం బట్నవిల్లి స్వగృహంలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మీనాక్షి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన పరిస్థితులపై విశ్వరూప్, బాలకృష్ణ చర్చించారు. అనంతరం మీనాక్షి పుట్టినరోజు సందర్భంగా విశ్వరూప్ దంపతులను దుశ్శాలువా కప్పి సత్కరించి అభినందించారు.

23 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఈనెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పట్టణంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. 23న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, 25న ఎన్‌జిఒ హోం సచివాలయంలో, 26న మద్దిపట్ల వారి వీధిలోని సచివాలయంలో, 28న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 30న మున్సిపల్ హైస్కూల్లోనూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఆధార్ అప్‌డేషన్, నూతన నమోదుకు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

కానూరులో ఉపాధి గ్రామసభ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీపై గ్రామసభను మంగళవారం సర్పంచ్ భావన మధుపూర్ణచందు అధ్యక్షతన జరిగింది. 2025-26 సంవత్సరానికి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ కింద కొత్త పనుల ప్రతిపాదనలు, పాత పనుల సమీక్ష, వేతన చెల్లింపులు, నీటి సంరక్షణ కార్యక్రమాలు, పచ్చదనం చర్యలు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రజల అభిప్రాయాలు సేకరించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో పనులు నిర్ణయించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి అవసరమైన పనిని అందించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ప్రయోజనాలు పొందేలా కృషి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.